క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రి నుంచి రోగి పరార్



కొండయ్యను తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు

జగిత్యాలక్రైం: జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చిన రోగి సోమవారం రాత్రి పరారీ కాగా, కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగుకు చెందిన మేరుగు కొండయ్య చెయ్యి విరిగడంతో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. దీంతో వైద్యులు కొండయ్యకు పట్టి వేసి వైద్యం చేస్తుండగా సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్రపోవడంతో రోగి ఆస్పత్రినుంచి వెళ్లిపోయాడు. దీంతో రాత్రి నుంచి కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం ఉదయం టవర్ సర్కిల్‌లోని గంజ్‌రోడ్‌లో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు రోగి దొరకడంతో ఊపిరి పీల్చుకున్నారు.

డిజిటల్ చెల్లింపులతో పారదర్శకత



స్కానర్లు పంపిణీ చేస్తున్న కమిషనర్

రాయికల్: ఆన్‌లైన్ డిజిటల్ ద్వారానే పారదర్శకత అని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ అన్నారు. మంగళవారం రాయికల్ పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో స్ట్రీట్ వెండర్స్ డిజిటల్ ఆన్‌బోర్డింగ్ కార్యక్రమం చేపట్టారు. డిజిటల్ లావాదేవీల ద్వారా పారదర్శకత ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీఎంసీ శరణ్య, పోస్టల్ డిపార్ట్‌మెంటల్ అధికారి కల్యాణి, ఆర్పీలు పాల్గొన్నారు.

చెరువులను కాపాడాలని వినతి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ధర్మపురి: పట్టణంలోని తమ్మల్లకుంట, చింతామణి చెరువులను కాపాడాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. స్థానిక చింతామణి చెరువు, తమ్మల్లకుంటల్లో నిల్వ ఉన్న నీటితో పరిసర ప్రాంతాలన్నీ తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉన్నాయి. కానీ వనరుల చుట్టు పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు పెరిగి ప్లాస్టిక్ వస్తువులతో కలుషితాలు అవుతున్నాయి. దీనికి మున్సిపల్ అధికారులు స్పందించి చెరువులతో పాటు చుట్టున్న పిచ్చిమొక్కలు, ముళ్ల కంచెలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు గాజు భాస్కర్, లవన్‌కుమార్, సత్యనారాయణ, బండారి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు



విద్యార్థినికి మెమొంటో అందిస్తున్న ఆర్డీవో

మెట్‌పల్లి: విద్యార్థులు చదువుల్లో రాణించడం పైనే దృష్టి పెడితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మనోహర్ గార్డెన్‌లో మంగళవారం స్థానిక జ్ఞానోదయ డిగ్రీ, పీజీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. దీనికి ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ఏ రంగంలోనైనా పోటీ అధికంగా ఉందన్నారు. సాధించాలన్న కృషి, పట్టుదల ఉంటే ఎందులోనైనా రాణించవచ్చన్నారు. చదువుకునే వయసుల్లో చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించడంపైనే దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై గంగాధర్, కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శివాజీ విగ్రహావిష్కరణ

కోరుట్ల రూరల్: మండలంలోని గుమ్లాపూర్‌లో బుధవారం శివాజీ విగ్రహాన్ని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆవిష్కరిస్తారని మండల బీజేపీ అధ్యక్షుడు పంచిరి విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిధులు మంజూరైనా... పనుల జాడేది ?



ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి రంగపేటకు వెళ్లే రోడ్డు



ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఒడ్డెర కాలనీకి వెళ్లే రోడ్డు

- నత్తనడకన అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులు
- టెండర్ల ప్రక్రియ పూర్తి
- పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లు
- రెండు మండలాల్లో ఇదే పరిస్థితి

సారంగాపూర్: గ్రామాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. పనులు మాత్రం సాగడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా పనులు మాత్రం జరగడం లేదు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్ల నుంచి గ్రామాల్లోకి వచ్చే అంతర్గత రోడ్లు కంకర తేలి, గుంతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై అధికారులు ప్రతిపాదించిన రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

నిధులు మంజూరు.... పనుల ప్రగతి ఇలా...

- ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి రంగపేట మీదుగా ఆలూరు వరకు 1.75 కిలోమీటర్ల రోడ్డు గుంతలు ఏర్పడి, కంకర తేలి వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు రూ. 1.65 కోట్లు మంజూరై టెండర్లు పూర్తయినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు.
- ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఒడ్డెరకాలనీ గ్రామంలోకి వచ్చే 800 మీటర్ల రోడ్డు రూ. 64లక్షలు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు.
- బట్టపల్లి శివారు గ్రామం మోహన్‌రావుపల్లె నుంచి పంట పొలాలకు వెళ్లే దారిలో రూ.31.94 లక్షలు వంతెన ఏర్పాటుకు నిధులు మంజూరై టెండర్లు పూర్తయినా పనుల ఊసే లేదు.
- పెంబట్ల గ్రామం చెరువు కట్ట మీది నుంచి రంగపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంట ఉన్న పెద్దమ్మ ఆలయం వరకు రూ. 58 లక్షలు నిధులు మంజూరై టెండర్లు జరిగినా పనులు ప్రారంభం కాలేదు.
- బీర్‌పూర్ మండలం మంగేళ నుంచి రంగసాగర్ గ్రామం వరకు 3.50 కిలోమీటర్ల రోడ్డును తారు రోడ్డుగా మార్చడానికి రూ. 3.65 కోట్లు మంజూరై టెండర్లు పూర్తయినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు.
- ఇప్పటికైనాఅధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు ప్రారంభించి రోడ్లు పూర్తి చేసి అవస్థలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి



రంగపేట, ఒడ్డెరకాలనీ గ్రామాలకు వచ్చే రోడ్ల పనులకు టెండర్లు పూర్తయినా అధికారులు పనులు ప్రారంభించ లేదు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి పనులు తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.
– మాలెపు సుధాకర్, రంగపేట

పొలాలకు వెళ్లలేకపోతున్నాం



బట్టపల్లి శివారు గ్రామం మోహన్‌రావు పల్లె నుండి పంట పొలాలకు వెళ్లే దారిలో వంతెన ఏర్పాటుకు నిధులు మంజూరీ అయినా ఇప్పటికి పనులు చేపట్టలేదు. వర్షాకాలంలో వరద వచ్చి పొలాలకు వెళ్లలేకపోతున్నాం.. వంతెన పనులు చేపట్టాలి. – అర్రై పేమానందం, బట్టపల్లి

చర్యలు తీసుకుంటున్నారు

పనులు ప్రారంభించడానికి ఉన్నతాధికారులు ఇప్పటికే టెండర్లు పొందిన కాంట్రాక్టర్లతో చర్చించారు. పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి...
– రాజమల్లయ్య, ఏఈ పంచాయతీరాజ్ సారంగాపూర్



సారంగాపూర్: మండలంలోని ధర్మనాయక్‌తండా గిరిజన గ్రామపంచాయతీ భవన నిర్మాణం రూ.20 లక్షల వ్యయంతో ప్రారంభించి ఏడాది దాటినా ఇప్పటి వరకు భవన నిర్మాణ పనులు పిల్లర్ల వరకు మాత్రమే జరిగి, పనులు ఆగిపోయి ఏడు నెలలవుతుంది. అధికారులు వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజమల్లయ్య, పీఆర్, ఏఈ, సారంగాపూర్, సెల్ నంబర్: 9440036348

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

యువత చెడు అలవాట్లకు లోను కావొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ అర్చన

జగిత్యాల: విద్యార్థులు యుక్తవయస్సులో చెడు అలవాట్లకు లోను కావద్దని నాన్ కమ్యూనికేబుల్ డీసీజేఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అర్చన అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లతో జీవితం గడిపేలా చూడాలని, సిగరెట్, గుట్కా, పాన్ మసాలాలతో జీవితం నశించిపోయే ప్రమాదం ఉందన్నారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ డింపుల్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల దృష్ట్యా మానసిక ఒత్తిడికి గురైతే 14416 నంబరుకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అమర్‌నాథ్‌రెడ్డి, ఎన్సీడీ కో–ఆర్డినేటర్ మురళీధర్, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రిటైర్డ్ ఉద్యోగులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

జగిత్యాల: పట్టణంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఆయనను సత్కరించారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మల్లికార్జున్, కార్యదర్శి అంజయ్య, ప్రతాప్, బాలమురళీకృష్ణ, గంగాధర్, శారద పాల్గొన్నారు.

సంచార జాతుల ఇళ్ల స్థలాల పరిశీలన



గుడిసెలను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ధర్మసాగర్ కాలనీలో సర్వే నంబర్ 440,441లో జీవిస్తున్న సంచార జాతుల గుడిసెలు వేసుకున్న ఇళ్ల స్థలాలను మంగళవారం ఆర్డీవో శ్రీనివాస్ పరిశీలించారు. కొంత కాలంగా సంచార జాతులైన పెద్దమ్మల వాళ్లు 19 కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రజావాణిలో విన్నవించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో పరిశీలించి ఎంతకాలం నుంచి గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారో, ఎంత మంది ఉన్నారో పరిశీలించారు. స్థలాలకు సంబంధించిన మ్యాప్‌ను వేసి పూర్తి స్థాయి విచారణ చేసి పంపించాలని ఆర్డీవో తహసీల్దార్ వరప్రసాద్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, ఆర్ఐ రేవంత్‌రెడ్డి, సర్వేయర్ భార్గవి, జీపీవో తిరుపతి, కాలనీవాసులు పాల్గొన్నారు.

కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

జగిత్యాల: పట్టణంలో కుక్కల బెడద ఎక్కువైందని, దీనిని నిర్మూలించేలా చర్యలు తీసుకోవాలని 35వ వార్డు కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుక్కల బెడద గురించి కౌన్సిల్‌లో వాటికి ఆపరేషన్ కోసం ఆమోదం తీసుకున్నామని, ఆ తర్వాత ప్రక్రియ చేపట్టినప్పటికీ కేవలం 2 వేల కుక్కలకే ఆపరేషన్లు చేశారని, ఇప్పటికీ వార్డుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయని, దీంతో పెద్దలు, పిల్లలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. వీటిని నిర్మూలించేలా చర్యలు తీసుకోవాలని, వెంటనే ఆపరేషన్లు చేయించాలని కోరారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

పెగడపల్లి: మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరమని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం రోడ్డు భద్రతపై ఎస్సై వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. వాహన ధృవీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. మైనర్లు ఎలాంటి వాహనాలు నడిపినా మోటారు వాహన చట్టం యాక్ట్ 160, 181 ప్రకారం వాహనాలు ఇచ్చిన వారికి జరిమానా విధిస్తామన్నారు.

చెక్కు అందజేత

కొడిమ్యాల: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన చిలువేరి వెంకటరెడ్డి 2018 లో విద్యుత్ షాక్ తో చనిపోగా, అతని భార్య చిలువేరి అరుణకు జగిత్యాల జిల్లా విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈ సుదర్శనం, డీఈ గంగారం , ఏడీఈ మహేందర్ పాల్గొన్నారు.

బాలిక వైద్యానికి దాతల సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

ధర్మపురి: అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలిక వైద్యం కోసం దాతలు రూ.1.37 లక్షల విరాళం అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని చిన్ననక్కలపేట గ్రామానికి చెందిన నల్ల వసంత శేఖర్ దంపతులకు కూతురు ఇందు (14) కుమారుడు సన్ని (10) ఉన్నారు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటున్నారు. కొడుకు సన్ని ఇటీవల షెకిల్‌సెల్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందాడు. అదే వ్యాధితో బాధపడుతున్న కూతురు ఇందూ తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు తెలిపారు. ఇందును చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. కూతురు వైద్యానికి డబ్బులు లేక పోవడంతో గ్రామానికి చెందిన వారియర్స్ యూత్ ఆధ్వర్యంలో రూ.5 వేలు, సోషల్ మీడియా ద్వారా 1.32 లక్షలు మొత్తం 1.37 లక్షల రూ.లు పోగుచేసి మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

గుల్లపేటను సందర్శించిన వ్యవసాయ విద్యార్థులు



జగిత్యాలఅగ్రికల్చర్: మండలంలోని గుల్లపేట గ్రామాన్ని పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ తీరు తెన్నులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీవో ద్వారా విత్తనోత్పత్తి, రైతులకు నాణ్యమైన ఎరువులు అందిస్తున్నట్లు చైర్మన్ దమ్మ గంగారెడ్డి విద్యార్థులకు వివరించారు. గ్రామంలో రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ పద్ధతులు, పంటల మార్పిడి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. గుర్రాల రవి అనే రైతు నిర్వహిస్తున్న కోళ్లు, గొర్రెల, డైరీ ఫారంను సందర్శించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ అర్చన, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ సతీశ్ పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పొలాలు పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: వరి పొలాలలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఆలస్యంగా నాట్లు వేసుకున్న పొలాల్లో ఎండు తెగులు, వస్తుందని తెలిపారు. కాటుక తెగులు వచ్చే అవకాశాలు ఉన్నాయని వీటి నివారణకు రైతులు ఎలాంటి రసాయన ఎరువులు వాడాలో వివరించారు. సమస్యలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

కబడ్డీ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపిక

ధర్మపురి: ఉమ్మడి జిల్లాలోని పెద్దపెల్లిలో మంగళవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ధర్మపురిలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన అఖిల్ అనే విద్యార్థి ఎస్‌జీఎఫ్ నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. విద్యార్థిని హెచ్‌ఎం శ్రీనివాస్, పీడీ స్వప్న, ఉపాధ్యాయులు అభినందించారు.

జెడ్పీలోనే జీపీఎఫ్ దరఖాస్తులు స్వీకరించాలి

జగిత్యాల: జెడ్పీలోనే జీపీఎఫ్ దరఖాస్తులు స్వీకరించాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌కు తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాద్ రావు మాట్లాడుతూ నెల రోజులుగా రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఒక జగిత్యాల జిల్లాలోనే దరఖాస్తులు తీసుకోవడం లేదని, ఉపాధ్యాయులు తాము దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు విత్‌డ్రా చేసుకునే పరిస్థితుల్లో లేరన్నారు. పరిష్కరించేలా చూడాలని కోరారు.

రైతులకు 'తేమ' కష్టాలు



కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

పెగడపల్లి: కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం విక్రయానికి రైతులు 'తేమ'తో కష్టాలు పడుతున్నారు. ధాన్యం ఎండక పోవడంతో తేమ శాతంతో తిప్పలు పడక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలంటే తేమ ఉండకూడదనే నిబంధన ఉంది. కొనుగోలు కేంద్రాల్లోకి తెచ్చి కుప్పలుగా పోసిన ధాన్యం ఆరబెట్టుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. పొద్దంతా ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు సాయంత్రం కుప్పగా పోసి కవర్లు కప్పాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. అయితే ఆయా కేంద్రాల్లో సరిపడా కవర్లు లేక రైతులే కవర్లు కిరాయికి తెచ్చుకుంటున్నామని, కవర్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులను కోరుతున్నారు.

ప్రతీ ఇంటిలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలి

కథలాపూర్: ప్రతీ ఇంటిలో ఖాళీ స్థలాల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి పేర్కొన్నారు. మంగళవారం కథలాపూర్ మండలం దుంపేట, రాజారాం తండా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. క్రిమిసంహారక మందులు లేని కూరగాయలు, ఆకు కూరలు సాగు చేసుకుంటే ఆరోగ్యపరంగా మంచిదన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు సునీత, సంధ్య, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

రాయికల్: పట్టణంలోని 3, 7 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసం సందర్భంగా మంగళవారం గర్భిణులు, బాలింతలకు సూపర్‌వైజర్ పద్మావతి పోషకాహారంపై వివరించగా, చిన్నారులకు అక్షరాభ్యాసం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వనిత, రజిత, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, జుబేద, ఫాతిమా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోషకాహార మాసోత్సవాలు

పెగడపల్లి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన జాతీయ పోషికాహార మాసోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం దోమలకుంటలో నిర్వహించిన కార్యక్రమంలో ఏసీడీపీవో అరవింద, సూపర్‌వైజర్ మహశ్వరి పాల్గొని అవగాహన కల్పించారు. సమతుల ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని, చిన్నారుల్లో ఎదుగుదల కూడా బాగుంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మమత, శ్రీలత, వైద్యసిబ్బంది, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు

మేడిపల్లి: వేములవాడ రాజన్న ఆలయంపై గత కొన్ని రోజులుగా జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో మేడిపల్లి, భీమారం మండలాల బీజేపీ శాఖల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఆవరణలోనే స్వామివారి ఆర్జిత సేవలు నిర్వహిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్యాల సురేశ్, నాగం శివకుమార్, రాష్ట్ర నాయకులు ఎస్‌ఎన్‌రెడ్డి, మామిడి ధర్మారెడ్డి, తాటి తిరుపతిరెడ్డి, వంశీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు ప్రొజెక్టర్ వితరణ

మేడిపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలకు వల్లంపల్లి మాజీ సర్పంచ్, మన ఊరు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెలమ సమత–నవీన్ రెడ్డి మంగళవారం రూ.32 వేల విలువ గల ప్రొజెక్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌బాబుకు అందజేశారు. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా మేడిపల్లి ప్రభుత్వ కళాశాలను తీసుకుపోతామని డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మార్గం నర్సారెడ్డి అన్నారు. కార్యక్రమంలో చేపూరి నాగరాజు,పుల్లూరి దేవయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఓటు చోరీ'పై సంతకాల సేకరణ

మల్లాపూర్ : 'ఓటు చోరీ' అంశంపై ప్రజల్లో విస్తృతమైన చర్చ జరగాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని సిరిపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఏలేటి అంజన్న, పెంట శ్రీనివాస్, బద్దం శేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలో గల 5 సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికిగాను 5–9వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు జిల్లా సమన్వయాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 16, 17 తేదీల్లో మేడిపల్లి మండలంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

17న ఉద్యోగ మేళా

జగిత్యాల: హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీటెక్, బీఈ ప్రోగ్రాం కోసం 2024–25 సంవత్సరం ఎంపీసీ, ఎంఈసీలో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈనెల 17న ఉదయం 11 గంటలకు ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఇంటర్‌మీడియట్ నోడల్ అధికారి నారాయణ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదివిన విద్యార్థులు హాజరు కావొచ్చని, పదో తరగతి పాస్ సర్టిఫికెట్‌తో పాటు, ఇంటర్ 2025–26లో పాస్‌కాబోతున్న వారు సైతం హాజరు కావొచ్చని తెలిపారు. మిగతా వివరాల కోసం 63032 07394 సంప్రదించాలని కోరారు.

విద్యార్థికి సన్మానం

మల్లాపూర్: సీనియర్ బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థి రుత్విక్ ఎంపికవడం గర్వకారణమని స్వర్ణకారుల సంఘం సభ్యులు అన్నారు. మల్లాపూర్‌లో మంగళవారం విద్యార్థి రుత్విక్‌ను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎగ్యారపు శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శులు తిప్పర్తి కిషన్, సింహరాజు నరేష్, సంఘం సభ్యులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, తిరుపతి, కట్ట వీరేంద్రచారి, తదితరులు పాల్గొన్నారు.